క్లుప్తంగా

పోలీసుల అదుపులో లిక్విడ్ గంజాయి విక్రేతలు!

గుంటూరు రూరల్: లిక్విడ్ గంజాయి విక్రేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇటీవల నగరంలోని పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి బ్యాచ్ పోలీసులకు పట్టుబడిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తీగలాగితే డొంక కదిలినట్లు పోలీసుల విచారణలో స్వర్ణభారతీనగర్‌కు చెందిన యువతి, యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. అక్రమార్కులకు విద్యార్థులే టార్గెట్‌గా చేసుకున్నారు. గంజాయిని నేరుగా విక్రయిస్తే వాసనకు అందరికి తెలుస్తుందని గమనించిన అక్రమార్కులు గంజాయిని తెచ్చి దానితో లిక్విడ్‌ను తయారు చేసి చిన్నచిన్న బాటిల్స్ ద్వారా విక్రయాలు చేస్తున్నట్లు సమాచారం.

సాయిబాబా మందిరంలో చోరీ

గుంటూరు రూరల్: అర్ధరాత్రి ఆలయంలో హుండీలను పగలగొట్టి దుండగులు నగదు దోచుకెళ్లిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాలు.. మండలంలోని వెంగళాయపాలెం షిరిడీసాయినాథుని ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు ఆలయం తాళాలు తీసి ఆలయంలోని రెండు హుండీలను బయటకు తెచ్చి ఆలయ ప్రాంగణంలోనే పగలగొట్టి హుండీలలోని నగదును దోచుకెళ్లారు. తెల్లవారిన తరువాత ఆలయంలోకి వచ్చిన ఆలయ కమిటీ సభ్యుడు నరశింహారావు విషయాన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో వివరాలను సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కిక్ బాక్సర్ కోటిని అభినందించిన పెమ్మసాని



గుంటూరు వెస్ట్(క్రీడలు): గత నెలలో కాంబోడియాలో నిర్వహించిన ఏషియన్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో కాంస్యంతో సహా రెండు పతకాలు సాధించిన యాసం కోటి నాగబాబును కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ శనివారం ఆయన కార్యాలయంలో అభినందించారు. వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న ప్రపంచకప్ కిక్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌కు కోటి ఎంపికయ్యాడు. రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ విధానంలో క్రీడాకారులకు ఎంతో లబ్ధిచేకూరుతుందన్నారు. యువత క్రీడలను ప్రొఫెషనల్‌గా స్వీకరించాలన్నారు. అత్యంత క్లిష్టతరమైన కిక్ బాక్సింగ్‌ను ఎంచుకుని దాంట్లో రాణిస్తున్న కోటి యువతరానికి ఆదర్శమన్నారు. ప్రపంచకప్ పోటీల్లో కోటి రాణించాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రమేష్‌కు సన్మానం



పొన్నూరు: పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది తుమాటి రమేష్ మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్‌గా ఎన్నికైన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ అంబేడ్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది జి.ఎస్.రాయల్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత డాక్టర్. బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సభలో డాక్టర్ తుమాటి రాజారావు, రాయల్, మామిడి సునీల్ పాల్గొని తుమాటి రమేష్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆకురాతి మురళి, న్యాయవాదులు తమనం ఆనంద్ బాబు, బి.ప్రకాష్, బి.శ్యామ్, పి.నాగేశ్వరావు, కట్టా రమేష్, బి.శ్రీనివాస్, హేమంత్, కె.విజయ్, పి.సుధాకర్, బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఎల్‌వీఆర్ క్లబ్‌లో నాటకోత్సవాలు ప్రారంభం

నగరంపాలెం: గుమ్మడి శ్రీమన్నారాయణ కళా సమితి, వైకే నాగేశ్వరరావు కళాపరిషత్ సంయుక్తంగా కొరిటిపాడు ఎల్.వీ.ఆర్. క్లబ్‌లోని వేదికపై రెండు రోజులపాటు నిర్వహించనున్న నాటకోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఎల్‌వీఆర్ క్లబ్ ఉపాధ్యక్షుడు వణుకూరి శ్రీనివాసరెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, నటుడు నాయుడు గోపి, కావూరి సత్యనారాయణ, అల్లూరి రామ లింగయ్య పరిషత్ అధ్యక్షులు శివప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కాట్రగడ్డ రామకృష్ణ, బొప్పన నరసింహారావు ఆధ్వర్యంలో జరగ్గా, హర్ష క్రియేషన్స్(విజయవాడ) ఆధ్వర్యంలో దివంగత డాక్టర్ పి.బ్రహ్మానందం రచన, కత్తి శ్యాంప్రసాద్ దర్శకత్వం వహించిన మనః సాక్షి సాంఘిక నాటిక ప్రదర్శించారు. పిళ్లా నటరాజ్ పర్యవేక్షణలో సందేశాత్మకంగా సాగింది. అనంతరం ఎన్టీఆర్ కల్చరల్ అసోసియేషన్(ఒంగోలు) నూదున గుంట వెంకటేశ్వర్లు రచన, దర్శకత్వం వహించిన హెచ్చరిక సాంఘిక నాటిక ప్రదర్శించగా, మంచి సందేశాన్ని అందించారు.



ఈదులపాలెంలో శనివారం సాయంత్రం మూడు గంటలకు పోలింగ్ కేంద్రం వద్ద కనిపించని బీఎల్ఓ



తిక్కిరెడ్డిపాలెంలో పోలింగ్ కేంద్రాల వద్ద ఇద్దరు బీఎల్ఓలకు గాను ఒక్కరే బీఎల్ఓ విధుల్లో



ప్రత్తిపాడు హైస్కూల్లో తొమ్మిది మంది బీఎల్ఓలకు గాను విధుల్లో ఉన్న ఆరుగురు బీఎల్ఓ

‘స్పెషల్’ ఏమీ లేదు.. అదే నిర్లక్ష్యం..!

- పోలింగ్ బూత్‌ల వద్ద కనిపించని సగం మంది బీఎల్ఓలు
- నామమాత్రంగా స్పెషల్ స్పెషల్ క్యాంపెయిన్

ప్రత్తిపాడు: ఎన్నికలు జరిగి ఆరుమాసాలు కూడా గడవక ముందే ఎన్నికల సంఘం పారదర్శక ఓటర్ల జాబితాతో పాటు ఓటు నమోదు ప్రక్రియపై మరోసారి దృష్టి సారించింది. స్పెషల్ సమ్మరీ రివిజన్–2025లో భాగంగా ఓటర్ల జాబితాలో మార్పులకు చేర్పులకు అవకాశం కల్పించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే తొలుత బీఎల్ఓలను ఇంటింటికీ పంపి నూతన ఓటర్ల వివరాలతో పాటు ప్రస్తుతమున్న ఓటర్లకు సంబంధించి ఏమైనా మార్పులు చేర్పులపై సర్వే చేయించింది. సర్వే అనంతరం గత నెల 29వ తేదీన ముసాయిదా జాబితా ఓటర్ల జాబితాను ఈఆర్వోలు ప్రచురించారు. ముసాయిదా జాబితాపై అభ్యంతరాలను స్వీకరించేందుకు అక్టోబరు 29 నుంచి నవంబరు 28వ తేదీ వరకు ఈసీ అవకాశం కల్పించింది. అంతే కాకుండా నవంబరు 28వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాలు పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్ఓలు అందుబాటులో ఉండి క్లెయిమ్స్‌తో పాటు అభ్యంతరాలను స్వీకరించాల్సి ఉంది. స్పెషల్ క్యాంపెయిన్ డేస్‌లో వచ్చిన అభ్యంతరాలను డిసెంబరు 24వ తేదీ లోపల పరిష్కరించి, 2025 జనవరి 6వ తేదీన ఫైనల్ పబ్లికేషన్ చేస్తారు.

నామమాత్రంగా..

మండలంలో సగానికిపైగా బీఎల్ఓలు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారు. శని, ఆదివారాల్లో పోలింగ్ బూత్‌ల వద్ద స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహించాలని స్పష్టమైన ఆదేశాలు ఎన్నికల సంఘం జారీ చేసినా వారు వాటిని పట్టించుకోవడం లేదు. శనివారం ప్రత్తిపాడు మండలంలో కనిపించిన ఈ చిత్రాలే అందుకు సాక్ష్యం. ఈదులపాలెంలో సాయంత్రం మూడు గంటలకు పోలింగ్ బూత్ వద్ద బీఎల్ఓలు కనిపించలేదు. తాళాలు వేసి పోలింగ్‌బూత్ దర్శనమిచ్చింది. తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద ఇద్దరు బీఎల్ఓలకు గాను ఒక్కరే విధుల్లో కనిపించారు. ప్రత్తిపాడు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో తొమ్మిది మంది బీఎల్ఓలకు గాను ఆరుగురే విధుల్లో కనిపించారు. ముగ్గురు విధులకు డుమ్మా కొట్టారు. కాగా, యనమదల, ప్రత్తిపాడు హెచ్‌ఈ స్కూల్లోని పోలింగ్ బూత్‌ల వద్ద బీఎల్ఓలు విధుల్లోనే కనిపించారు. నియోజకవర్గంలోని 288 పోలింగ్ బూత్‌ల్లో కలిపి శనివారం పదకొండే అర్జీలు వచ్చాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాటిలోనూ ఫారం–6 రెండు, ఫారం–7 నాలుగు, ఫారం–8 ఐదు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

సర్వేపైనా ఆరోపణలు..

స్పెషల్ సమ్మరీ రివిజన్‌లో భాగంగా బీఎల్ఓలు చేసిన ఇంటింటి సర్వేపైనా పలు విమర్శలు వినిపిస్తున్నాయి. బీఎల్ఓలు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లకుండానే కార్యాలయాల్లో కూర్చుని సర్వేను ముగించారన్న ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జరుగుతున్న స్పెషల్ క్యాంప్‌లను కూడా నామమాత్రంగా నిర్వహిస్తూ మమ అనిపించేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో కీలకమైన స్పెషల్ క్యాంపైన్ సాదాసీదాగా సాగిపోతుంది. దీనిపై ప్రత్తిపాడు మండల ఎన్నికల విభాగం సీనియర్ అసిస్టెంట్ మాణిక్యరావును వివరణ కోరగా కచ్చితంగా బీఎల్ఓలంతా నవంబరు 28వ తేదీ వరకు ప్రతి శని, ఆదివారాలు పోలింగ్ బూత్‌ల వద్ద ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు అందుబాటులో ఉండాల్సిందేనని చెప్పారు. లేనివారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

వైద్యులు పనితీరు మార్చుకోవాలి



కాకుమాను: వైద్యులు తమ పనితీరు మార్చుకుని పనిచేయాలని పల్నాడు జిల్లా డీఎంహెచ్ఓ రవి అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రంలో పనిచేసే ఓ వైద్యుడిపై రాష్ట్ర ఆరోగ్యశాఖకు ఫిర్యాదు రావడంతో విచారణ నిమిత్తం వచ్చినట్లు చెప్పారు. వైద్యులు నిబద్ధతతో పని చేయాలని సూచించారు. నివేదికను రాష్ట్ర ఆరోగ్యశాఖకు పంపనున్నట్లు తెలిపారు.

నేడు ఉచిత నేత్ర వైద్యశిబిరం

కాకుమాను: మండలంలోని కొండపాటూరులో ఆదివారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు యార్లగడ్డ జయప్రద, రామయ్య చారిటీస్ వ్యవస్థాపకుడు యార్లగడ్డ అంకమ్మ చౌదరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. చారిటీస్‌తో పాటు జిల్లా అంధత్వ నివారణ సంస్థ సంయుక్తంగా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. శిబిరంలో శంకర కంటి ఆస్పత్రి వైద్యులు పాల్గొని పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు.

ప్రజా సమస్యలు పట్టని ప్రభుత్వాలు

కాకుమాను: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రజా సమస్యలు పట్టడం లేదని సీపీఎం పెదనందిపాడు మండల కార్యదర్శి దొప్పలపూడి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని కాకుమాను, కొండపాటూరు, పెద్దివారిపాలెం, కొమ్మూరు, గార్లపాడు గ్రామాలలో ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టిన ప్రజాపోరు ఉద్యమం కరపత్రాల ప్రచారం కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఎరువుల కొరతతో రైతులు తీవ్రఇబ్బందులు పడుతన్నారని అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం పత్తి సీజన్ వచ్చిందని అయినా పెదనందిపాడు మండలంలోని నాగులపాడులో ఉన్న మార్కెట్ యార్డులో ఇప్పటి వరకు సీసీఐ కేంద్రాన్ని ఏర్పాటు చేయలేదని చెప్పారు. ఉచిత ఇసుకను అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు పనులు కల్పించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం చేపట్టిన ప్రజాపోరు కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలో కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి కొత్త వెంకట శివరావు,నాయకులుజంపని రామారావు,ముద్దన వెంకటేశ్వర్లు, నల్లమోతు రాజేంద్ర పాల్గొన్నారు.



ప్రజాపోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స

ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్

చేబ్రోలు: సరైన ఔషధ వినియోగం ద్వారా హాస్పిటల్ వ్యయాన్ని తగ్గించి, రోగులకి తక్కువ ఖర్చుతో మెరుగైన చికిత్స అందించవచ్చునని యూఎస్ఏ–ఓహాయోలోని యూనివర్సిటీ ఆఫ్ ఫిండ్లే ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ ఫార్మసీ కళాశాలలో 'క్లినికల్ ఫార్మసీ ప్రాక్టిస్ అండ్ రీసెర్చ్' అనే అంశంపై రెండు రోజుల పాటు నిర్వహించిన కాన్ఫరెన్స్ శనివారం ఘనంగా ముగిసింది. ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసీ అనేది వైద్యరంగంలో రోగులకు సమర్థంగా ఔషధ చికిత్స అందించడంలో సహకరిస్తుందని చెప్పారు. ఫార్మసిస్టులు వైద్యులతో కలసి పనిచేస్తూ, రోగులకు సరైన మందులు, సరైన మోతాదు, మరియు సరైన చికిత్స అందించడంలో కీలక పాత్ర పోషిస్తారని వెల్లడించారు. ముంబాయిలోని ఎన్ఎంఐఎంఎస్ యూనివర్సిటీ ప్రో–వైస్ చాన్స్‌లర్ మీన చింతమనేని మాట్లాడుతూ నూతన సాంకేతికతలను ఉపయోగించి భారతదేశంలోని ప్రత్యేక పరిస్థితులలో రోగుల ఆరోగ్యం పెంపొందించేందుకు కొత్త మార్గాలను అన్వేషించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. యూఎస్ఏలోని అవినిడా సొల్యూషన్స్ సీఈఓ కార్తీక్ రాకమ్ మాట్లాడుతూ క్లినికల్ ఫార్మసీ పరిశోధనల ద్వారా వ్యాధులపై అవగాహన పెరిగి, అనవసర ఔషధ వినియోగం తగ్గుతుందన్నారు. ఫార్మసిస్టులు ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు సురక్షితమైన ఔషధ వినియోగం పెరుగుతుందన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్

ఆక్రమణల తొలగింపునకు సహకరించాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్, జనాభా అవసరాల దృష్ట్యా ప్రధాన డ్రెయిన్లు, రోడ్ల ఆక్రమణల తొలగింపు చేపట్టినట్లు కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం అమరావతి రోడ్, నంది వెలుగు రోడ్, ఇన్నర్ రింగ్ రోడ్, నలంద నగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. తొలుత కమిషనర్ అమరావతి రోడ్డులో డ్రెయిన్, రోడ్లపై ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమణలు తొలగించిన ప్రాంతాల్లో సిల్ట్ తీయాలని అధికారులకు సూచించారు. ఒకసారి తొలగించిన ఆక్రమణలు తిరిగి ఏర్పాటు చేయకుండా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. బస్టాండ్ ఎదురు ఆక్రమణలు తొలగించడంతో పాటు ప్రకటనల హోర్డింగ్స్ డ్రెయిన్‌కు ముందుకు రాకూడదని, వెంటనే తొలగించాలని కోరారు. ఆక్రమణదారులకు రెండు రోజుల్లో తొలగించుకోవాలని ముందుగా తెలియ చేసి, సోమవారం నుంచి పూర్తి స్థాయిలో తొలిగించడానికి చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సదరు ప్రాంతంలోని రైతు బజార్ కి వచ్చే వినియోగదార్ల వాహనాలు రైతు బజార్ ప్రాంగణంలోనే పార్క్ చేసేలా బాధ్యత తీసుకోవాలని కోరారు. నందివెలుగు రోడ్డు విస్తరణ చేసినప్పటికీ ఆక్రమణలు వలన ఉపయోగం లేకుండా ఉందని, తక్షణం ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకొని తొలగించాలని ఏసీపీని ఆదేశించారు. బస్టాండ్ ఎదుట ట్యాక్సీ వాలాలు, ఆటో డ్రైవర్లతో వాళ్ల స్టాండ్‌లో నేరుగా మాట్లాడుతూ బస్టాండ్ ప్రాంతంలో అధిక ట్రాఫిక్ ఉంటుందని, ట్రాఫిక్ నియంత్రణకు సహకరించాలని పేర్కొన్నారు. అనంతరం నలంద నగర్‌లో స్థానిక కార్పొరేటర్ మానం పద్మశ్రీ కలసి పర్యటించి, ఆయా ప్రాంతాల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ అధికారులు సమన్వయంతో విధులు నిర్వహించాలన్నారు. నలంద నగర్ మెయిన్ రోడ్ లో కల్వర్ట్ కుంగి పోవడం వలన మురుగు సక్రమంగా వెళ్లడం లేదని, తక్షణం నూతన కల్వర్ట్ నిర్మాణంకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. అపార్టమెంట్ల ర్యాంప్‌లు రోడ్ల మీదకు రాకుండా పట్టణ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. పర్యటనలో ఈఈలు కోటేశ్వరరావు, సుందరరామిరెడ్డి, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఏసీపీ రెహ్మాన్, జాతీయ వినియోగదార్ల సమాఖ్య ఉపాధ్యక్షుడు డాక్టర్ సిహెచ్.హరిబాబు, డీఈఈ రమేష్, ఏఎంహెచ్ఓలు ఆనందకుమార్, రాంబాబు పాల్గొన్నారు.



అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

ఘనంగా మేడ్ రాష్ట్ర 7వ మహాసభ

నెహ్రూ నగర్: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయీస్ (మేడ్) రాష్ట్ర 7వ మహాసభ గుంటూరులో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు హాజరై మాట్లాడుతూ ఏడు సంవత్సరాలుగా దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేడ్ కృషి చేయడం అభినందనీయమన్నారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మేడ్ ముందు వరసలో ఉంటుందన్నారు. అనంతరం 2024 నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మెడికల్ సీట్లు సంపాదించిన దళిత విద్యార్థులను ఈ సందర్భంగా సన్మానించారు.

నేడు ఓటు అభ్యంతరాలపై ప్రత్యేక శిబిరం



పొన్నూరు: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో ఇటీవల ప్రదర్శించిన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరంలో తెలియజేయాలని తహసీల్దార్ మహమ్మద్ జియావుల్ హక్ తెలిపారు. శనివారం పలు పోలింగ్ కేంద్రాలను ఆయన సందర్శించి సిబ్బంది పనితీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు బీఎల్ఓలు అందుబాటులో ఉంటారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండి అర్హత కలిగిన యువత కొత్తగా ఓటు నమోదు చేసుకొనుటకు ఫారం–6, ఓటు తొలగించుకోవాల్సిన వారు ఫారం– 7, ఓటు సవరణ, బదలాయింపు చేసుకునే వారు ఫారం–8 లను దాఖలు చేయాలని సూచించారు. ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

అలరించిన సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం రాత్రి ముత్తుస్వామి దీక్షితుల సంగీత మహోత్సవం జరిగింది. గాయత్రి మహిళా సంగీత సన్మండలి అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, ప్రధాన కార్యదర్శి ఎం.వై. శేషురాణి అధ్యక్షత వహించారు. విశ్రాంత లెక్చరర్ కేవీ బ్రహ్మానందం (విజయవాడ), రేడియోలజిస్ట్ డాక్టర్ సుజాత జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. డాక్టర్ వై.రమాప్రభ దీక్షితార్ కతి సంగీత కచేరి జరగ్గా, ముత్తుస్వామి దీక్షితార్ కతులకు సోదాహరణాత్మక వివరణ యిస్తూ గానం చేశారు. వయోలిన్‌పై ఎన్‌వీఎస్ఎల్ ప్రసన్న(విశాఖపట్నం) మృందంగంపై బీరక సురేష్‌బాబు(గుంటూరు), మోర్సింగ్‌పై టి.లక్ష్మీశంకర్(ఏలూరు) వాయిద్యా సహకారాన్ని అందించారు. ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, పి.లలితాదేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొనగా, కళాకారులను అతిథులను సత్కరించారు.

చికిత్సపై అవగాహన సదస్సు

గుంటూరు రూరల్: విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి శాంతియుతమైన జీవితాన్ని గడపడానికి ప్రాణచికిత్స అవసరమని నగరంలోని ప్రాణిక్ హీల్స్ అసోసియేషన్ సభ్యుడు డాక్టర్ చరణ్ రాజా తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రియదర్శిని ఇంజినీరింగ్ కాలేజ్‌లో ప్రాణచికిత్సపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణచికిత్స వల్ల విద్యార్థి దశ నుంచి సూపర్ బ్రెయిన్ యోగ, చైతన్య క్రియ ధ్యానం, శరీరం స్వీయ పునరుద్ధరణకు ఉపయోగపడుతోందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఫణికుమార్, వైస్ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బస్ స్టాప్‌లో సమస్యలకు పరిష్కారం



తిరిగిన ఫ్యాన్లు.. విద్యుత్ వెలుగులలో బస్ స్టాప్



ఏర్పాటు చేసిన కొత్త స్విచ్ బాక్స్

పొన్నూరు: పట్టణ ఐలాండ్ సెంటర్‌లోని గుంటూరు బస్ స్టాప్‌లో కొన్ని నెలలుగా ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం లభించింది. బస్ స్టాప్‌లో కాలిపోయిన స్విచ్ బాక్స్ కారణంగా ఫ్యాన్లు తిరగవు. లైట్లు వెలగవు శీర్షికన ఈ నెల 5వ తేదీన సాక్షి లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ ముప్పాళ్ల రమేష్‌బాబు ఆదేశాలతో సంబంధిత లీజుదారుడు బస్‌స్టాప్‌లో కొత్త స్విచ్ బాక్స్ ఏర్పాటు చేయడంతో ఫ్యాన్లు తిరిగి, లైట్లు వెలిగాయి.

సకురా సైన్స్ ప్రాజెక్ట్- 2024కు విజ్ఞాన్ అధ్యాపకులు ఎంపిక

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకు చెందిన ఇద్దరు అధ్యాపకులు జపాన్‌లోని సకురా సైన్స్ ప్రాజెక్ట్–2024కు ఎంపికయ్యారని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ శనివారం తెలిపారు. విజ్ఞాన్ యూనివర్సిటీ బయోటెక్నాలజీ డిపార్ట్‌మెంట్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు ఎన్.ఎస్.సంపత్ కుమార్, చింతగుంట అంజనీ దేవి జపాన్ దేశం టోక్యోలోని జపాన్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఏజెన్సీ (జేఎస్టీ) ఏడు రోజుల పాటు యూనివర్సిటీ ఆఫ్ మియజాకీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ''సకురా ప్రాజెక్ట్–2024''కు ఎంపికయ్యారని వీసీ తెలిపారు. నవంబర్ 10 నుంచి 16వ తేదీ వరకు కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్ట్‌కు ఎంపికైన అధ్యాపకులను వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్‌తో పాటు రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్ అభినందించారు.



ధ్యాపకులను అభినందిస్తున్న వైస్ చాన్సలర్ నాగభూషణ్, రిజిస్ట్రార్ రఘునాథన్ తదితరులు

నిర్లక్ష్యం..



చేబ్రోలు మండలం వేజండ్ల జెడ్పీ హైస్కూలు సమీపంలో ప్రధాన రహదారి పక్కన నాటకుండానే ఎండిపోతున్న మొక్కలు

చేబ్రోలు: వేలాది రూపాయిల వ్యయంతో తీసుకువచ్చిన మొక్కలు అధికారుల నిర్లక్ష్యంతో నాటకుండానే ఎండుమొఖం పడుతున్నాయి. రెండు నెలల క్రితం అన్ని గ్రామాల పరిధిలో గ్రామాల్లో పచ్చదనం కోసం ప్రభుత్వం చేబ్రోలు మండలానికి నర్సరీల నుంచి మొక్కలను సరఫరా చేసింది. మొక్కుబడిగా నాలుగు మొక్కలు నాటి మిగిలిన వాటిని నాటకుండా రోడ్డుపక్కన పడవేశారు. దీంతో వేలాది రూపాయిల ఖర్చుతో తీసుకువచ్చిన మొక్కలు ఎండుమొఖం పట్టాయి. మండల పరిధిలోని వేజండ్ల జెడ్పీ హైస్కూల్ సమీపంలో ప్రధాన రహదారి పక్కన నర్సరీ నుంచి వచ్చిన సుమారు వంద మొక్కలు వృథాగా పడి ఉన్నాయి. దీనిపై ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీఓ ఆనంద్ మోహన్‌ను వివరణ కోరగా నిరుపయోగంగా రోడ్డు పక్కన ఎండిపోతున్న మొక్కలు మాకు సంబంధం లేదని పంచాయతీ అధికారులదే బాధ్యత అన్నారు.

రేపు ప్రత్యేక హోదా సాధన కోసం ధర్నా

లక్ష్మీపురం: ప్రత్యేక హోదా సాధన కోసం గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కమ్యూనిస్టు ఇండియా, ఆల్ ఇండియా జైహింద్ పార్టీ, సమాజ్‌వాది పార్టీల ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్)శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ధర్నా కార్యక్రమంలో పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొంటారని చెప్పారు.

18న తపాలా జీవిత బీమా ఏజెంట్ల నియమాకానికి ఇంటర్వ్యూలు

లక్ష్మీపురం: స్థానిక చంద్రమౌళినగర్ పోస్టల్ సూపరింటెండెంట్ కార్యాలంయలో ఈనెల 18వ తేదీ తపాలా భీమా ఏజెంట్ల నియమాకానికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు గుంటూరు డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ యలమందయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు పోస్టల్ డివిజన్ పరిధిలో జీవిత బీమా గ్రామీణ తపాలా జీవిత బీమా పథకాల కోసం కమిషన్ విధానంలో ఏజెంట్లుగా పని చేసేందుకు ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. ఏజెంట్లుగా పనిచేసే వారికి కనీస అర్హత పదో తరగతి, ఇంటర్మీడియెట్ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నామని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు గుంటూరు నగరంలోని చంద్రమౌళినగర్ పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలోని సూపరింటెండెంట్ ఆఫ్ పోస్ట్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావల్సిందిగా కోరారు. నియమించబడిన అర్హత కలిగిన అభ్యర్థులకు రూ.5వేలు సెక్యూరిటీ డిపాజిట్‌గా 5 సంవత్సరాల నేషనల్ సేవింగ్ సర్టిఫికెట్ రూపంలో పూచికత్తు సమర్పించాల్సి ఉంటుందని తెలిపారు. రూ.5 వేలు కూడా ఏజెన్సీ రద్దు చేసుకున్న సమయంలో జాతీయ పొదుపు పథకం వడ్డీ రేటుతో సహా తిరిగి చెల్లిస్తుందని తెలిపారు.